క్లుప్తంగా

జీడిపల్లిలో స్వచ్ఛభారత్



జీడిపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి గ్రామ యువత ఆదివారం 11వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులను శుభ్రం చేశారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని తొలగించి, డంప్ యార్డ్‌కు తరలించారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడా పరికరాలను అందిస్తున్న దాతలు

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ పొందుతున్న సాఫ్ట్‌బాల్ జూనియర్ క్రీడాకారులకు సొంత ఖర్చులతో క్రీడా పరికరాలను, దుస్తులను రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాలయ్య అందజేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు సీఐ రవికుమార్ సహకారంతో క్రీడాకారులకు ప్రోత్సాహం కోసం అందజేసినట్లు తెలిపారు.

జంగరాయికి వైకుంఠరథం



వైకుంఠ రథం అందించిన దాతను సన్మానిస్తున్న ప్రభాకర్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామానికి చేపూరి లతరమేశ్ వైకుంఠ రథం బహూకరించారు. ఆదివారం జంగరాయి తాజా మాజీ సర్పంచ్ బందెల జ్యోతిప్రభాకర్‌కు వైకుంఠ రథం అందజేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మకంతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్, శంకరయ్యస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని మక్తలక్ష్మాపూర్, ముసాపేట తదితర గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైహింద్‌రెడ్డి, సాయిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చిన్న విజయ్ తదితరులున్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న నాగేశ్ ముదిరాజ్

పాపన్నపేట(మెదక్): మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని యూసుఫ్ పేటలోని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి స్వగృహంలో ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా మెదక్ ఉమ్మడి జిల్లాలో ప్రజలకు ఎంతగానో సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు దుర్గయ్య, సత్యనారాయణ మాజీ సర్పంచ్‌లు కిష్టయ్య, ఆశయ్య, సుధాకర్, మాజీ ఎంపీటీసీ సాయిలు, సిద్ధిరాములు, మనోహర్, వివిధ గ్రామాల ముదిరాజ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజేష్ రాజీనామా

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు నార్సింగి మండల బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ టెలికాం బోర్డు మెంబర్ అంచనూరి రాజేశ్ తెలిపారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



కుసంగిలో బోనాలు ఊరేగిస్తున్న భక్తులు



ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని కుసంగి గ్రామంలో బీరప్పస్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం బోనాలను ఘనంగా ఊరేగించారు. ఇందులో భాగంగా శివసత్తుల వేశాధారణలు, నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో ఓగ్గు కళాకారులు స్వామివారి కథను చెప్పారు. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. నిర్వాహకులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి అర్చకులు కుంకుమార్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు.



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ ఆలయంలో..

తునికి నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీ నెలకొంది. ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పలువురు భక్తులు తల నీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం సీఈఓ వెంకటేశం

టేక్మాల్(మెదక్): మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చల్లపల్లిలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం సీఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. దళారుల వ్యవస్థ నుంచి విముక్తి పొందడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. తేమ శాతాన్ని 15 నుంచి 17 వరకు ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. పగలు ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రం వరకు ధాన్యాన్ని కుప్పగా చేర్చాలని, వర్షాలకు తడవకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మొగులయ్య, సెంటర్ ఇన్‌చార్జి మోహన్, సంఘ సభ్యులు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కనులపండువగా కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని శివ్వంపేటలో కొలువైన కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారిని హనుమంత వాహన పల్లకీసేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, చందు పంతులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆర్థిక సహాయం

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో నివాస పూరి గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయిన కుటుంబానికి ఆయా పార్టీల నాయకులు వేర్వేరుగా ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి సాకలి నర్సింలు నివాస పూరి గుడిసె శనివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి దగ్ధమైన సంఘటన విధితమే. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు గాలి లక్ష్మీనారాయణ, అనిల్, బీజేపీ నాయకుడు అరవింద్ గౌడ్ వేర్వురుగా ఆర్థిక సహాయం అందజేశారు.

ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శిలాన్యాసం



శిలాన్యాసం నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం శిలాన్యాసం చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, రఘుశర్మ ఆధ్వర్యంలో శిలాన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మనోహరాబాద్(తూప్రాన్): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని కృషి చేస్తామని సంఘం అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో బంగారమ్మ దేవాలయం వద్ద భవన కారిత్రక, తాపీ మేస్త్రి, సెంట్రింగ్ కార్మికులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, శ్రీను, శ్రీనివాస్ మేస్త్రి, రాజు మేస్త్రి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాళ్లకల్ వద్ద సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



కౌడిపల్లి(నర్సాపూర్): సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని అభయ సీతారామాలయం 31వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ, ఆంజనేయ భజన మండలి సభ్యులు డాక్టర్ పురుషోత్తం, ఉడుత రాజు, జగన్, పెంచలయ్య, వడ్ల దశరథ, అవుసలి బ్రహ్మచారి, పద్మ దుర్గయ్య, ప్రతాప్‌రెడ్డి, పోల నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో వేణుగోపాల స్వామి రథోత్సవం భక్తుల సంకీర్తనలతో విశేషంగా జరిగింది. పట్టణ పుర వీధుల్లో రథోత్సవం ఊరేగించగా మహిళలు మంగళహారతులు ఇచ్చి స్వాగతించారు. రథోత్సవంలో భక్తులు హాజరై మొక్కుకున్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

మాధవానంద సరస్వతి స్వామి

నర్సాపూర్ రూరల్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు అని మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో ఆదివారం వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, నాభిశిల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీరాంజనేయ శివ పంచాయతన సహిత నాభిశిల ప్రతిష్ఠ మాధవానంద స్వామి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు దారి చూపుతాయన్నారు. అందరూ భక్తి భావన కలిగి భగవంతుని పూజించాలన్నారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన దాత జీవక ఇండస్ట్రీస్ యజమాని మోహన్ లాల్ అగర్వాల్ కుటుంబం ప్లాంట్ ఇన్‌చార్జ్ హరీశ్‌ను గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్, నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్, ఎంపీటీసీ శోభా విజయ్ కుమార్, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జగన్, జనార్దన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ సభ్యులు రవి యాదవ్, రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.



వీరాంజనేయ నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవాలు

కొనసాగుతున్న బీజేపీ ఇంటింటి ప్రచారం



పాపన్నపేట(మెదక్): బీజేపీలో చేరిన కార్యకర్తలు



పెద్దశంకరంపేట(మెదక్): చీలాపల్లిలో బీజేపీ నాయకుల ప్రచారం



టేక్మాల్‌లో..

టేక్మాల్(మెదక్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని మండల కేంద్రం టేక్మాల్‌లో బీజేపీ నాయకురాలు వచన పాటిల్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలైన సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరు కమలం గుర్తుకు ఓటు వేసి బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఇందులో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పట్లోళ్ల మల్లిక, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రెడ్యానాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధు, నాయకులు అశోక్, రాములు తదితరులు ఉన్నారు.

బీబీ.పాటిల్‌ను గెలిపించండి

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బీబీ.పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ.. మండలంలో ఇంటింటి ప్రచారం కొనసాగుతోంది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీజేపీ చేపట్టిన అభివృద్ధిపై కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు.

పులిమామడి కిష్టాపూర్‌లో..

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని పులిమామిడికిష్టాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎన్ చారి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచులు నాగభూషణం, రఘువీర్‌రావు, సోషల్ మీడియా కన్వీనర్ అంజనేయులు, శేఖర్, ఎల్లం, చింటూ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పాతలింగాయపల్లిలో ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది నాయకులు బీజేపీలో చేరినట్లు మండల శాఖ బీజేపీ అధ్యక్షుడు బీకొండ రాములు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. మోదీ పాలనకు ఆకర్షితులైన పలువురు యువకులు, నాయకులు బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. భారత్ ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా రూపొందు తుందన్నారు. కార్యక్రమంలో విఠల్, కృష్ణ, నవీన్, దత్తు, కుమార్, బీరప్ప, రాజు, దామోదర్, సంగమేశ్, వినోద, శంకర్‌గౌడ్, దుర్గాప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేగుంట(తూప్రాన్): పులిమామిడి కిష్టాపూర్‌లో..

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

బైక్ చక్రాలు చోరీ



చక్రాలు చోరీ అయిన బైక్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శివాలయం వీధిలో బైక్ చక్రాలు చోరీ అయ్యాయి. పట్టణానికి చెందిన శ్రీపాల్ శనివారం రాత్రి తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి బైక్ రెండు చక్రాలు చోరికి గురయ్యాయి. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. కాగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామాయంపేట(మెదక్): పట్టణంలో 2000 – 01 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరి నొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామ్మూర్తి, రాంకిషన్‌రావు, స్వరూపారాణి, శశికళను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

మడలేశ్వర శీతల దేవి విగ్రహ ప్రతిష్ఠ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రజక కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మడలేశ్వర శీతల దేవి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొదటిరోజు గణపతి పూజ, పుణ్యవచనం, మహా చండీ హోమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు వెంకటరామ్మోహన్, రజక సంఘం సభ్యులు చంద్రం, బైరయ్య, ముత్తయ్య, నర్సింలు, వెంకయ్య, సురేష్, స్వామి, నితీష్ తదితరులు పాల్గొన్నారు.



మహా చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

వీరంజనేయస్వామి ఆలయంలో పూజలు

తూప్రాన్: పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై వీరాంజనేయ స్వామి ఆలయంలో జన్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హనుమాన్ గురుస్వామి శలాక ఆత్రేయ శర్మ మాట్లాడుతూ.. 40 సంవత్సరాల నుంచి హనుమాన్ జన్మోత్సవాలు అశేష భక్తుల మధ్య ఇక్కడ ఘనంగా జరుపుతున్నామని తెలిపారు. 21న ఆదివారం క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ త్రయోదశి ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణము, సుందరకాండ, గురు చరిత్ర పారాయణం మన్యుసూక్త పాశుపతము, సీతారామ లక్ష్మణ విగ్రహాలకు అభిషేకం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అలాగే 22న సోమవారం చైత్ర శుద్ధి చతుర్దశి రోజున గణపతి నవగ్రహ రుద్ర పంచసూక్త, మన్యుసూక్త, లక్ష్మి హోమం, భిక్ష ఇరుముడి, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాదం, 23న హనుమాన్‌కి సింధూరం, లక్ష పత్ర పూజ, లక్ష పుష్పార్చన, అమ్మవారికి ఓడిబియ్యం, కుంకుమార్చన, మాధవానంద స్వామి పాద పూజ, అనుగ్రహభాషణ, ఉదయం 9 నుంచి ఉదయం 11 వరకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, తీర్థప్రసాదన వితరణ, అన్నదానం, మాల విరమణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు